30న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 30న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగమేళాలో టెక్ క్లీన్ బోయలంటి మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్, మేక్ మై ట్రిప్, శాంసంగ్, మీషో, యంగ్ ఇండియా, వాచర్స్ ఫ్లిప్కార్ట్ గ్రీన్ కార్స్ ఇండియా హిందుస్తాన్ కోకో కోల తదితర కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు naipunyam .ap. gov.in/user-registrationలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9550104260, 9177143181, 8897776368లో సంప్రదించాలన్నారు.

జిల్లాకు మొంథా గుబులు

- వణుకు పుట్టిస్తున్న వాతావరణంలో మార్పులు
- పాఠశాలలకు సెలవు
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రంగా మారడంతో మొంథా తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతల్లో గుబులు పట్టుకుంది. జిల్లా కలెక్టర్ నుంచి గ్రామస్థాయి ఉద్యోగి వరకూ అంతా తుపాన్ ముందస్తు చర్యలకు సంబంధించిన పనుల్లో నిమగ్న మయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాజంపేట నియోజకవర్గంలోని వరి పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వరి, టమోటా, బొప్పాయి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాలలో వరి కోత ప్రారంభమైన నేపథ్యంలో తుపాన్ హెచ్చరిక రావడంతో ఏమి చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. తుపాన్ కారణంగా గాలివానకు పంటలు నేలపాలవుతుందన్న భయం రైతులలో వ్యక్తం అవుతుంది.

పాఠశాలలకు సెలవు..: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గతంలో జరిగిన సంఘటన దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు సోమ, మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. ఆదివారం సెలవు కావడంతో వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి.



బి.కొత్తకోట వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్


అధికారులు అప్రమత్తం..: జిల్లాలో తుపాన్ కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాన్ హెచ్చరిక నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల కేంద్రాలలో కూడా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08561-293006) ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశామని, సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మొంథా తుపాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు పకడ్బందీగా పనిచేయాలన్నారు. విద్యుత్, కమ్యూనికేషన్, రోడ్డు రవాణా వ్యవస్థలు స్తంభించకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో రమాదేవితో పాటు జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు సమక్షంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండెం సుధీర్ కుమార్‌తో పాటు మరికొందరు సిపిఎంలో చేరారు. పార్టీలో చేరిన వారికి రమాదేవి కండువాలు వేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాలు పాటు సిపిఎంతో పాటు పలు వామపక్ష పార్టీల్లో క్రియాశీలకంగా పనిచేసిన మండెం సుధీర్ చివరకు ప్రజా అనుకూల విధానాలను అవలంభించే ఏకైక రాజకీయ పార్టీ సిపిఎం అని విశ్వసించి తిరిగి పార్టీలో చేరడం మంచి పరిణామని పేర్కొన్నారు. సుధీర్‌తో కలిసి ఉద్యమాలను పాల్గొన్న చుక్క వీరభద్ర, కొండారెడ్డి సుధాకర్ పులిమి వెంకటరమణ, గాలివీటి రామాంజనేయులు, పండరయ్య, పరసారెడ్డి ప్రసాద్, నరసింహులు తదితరులు పార్టీలో చేరడం సంతోషదాయకమని తెలిపారు. నేడు దేశంలో, రాష్ట్రంలో ఏర్పాటైన ప్రభుత్వాలు మనువాద, మతోన్మాద విధానాలను అవలంభిస్తూ ప్రజా సమస్యలను గాలికి వది లేయడం ద్వారా ప్రజలకు అనేక రకాల ఇబ్బందులను కలిగిస్తున్నాయని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేస్తుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఎం విధానాలే దేశాభివృద్ధికి ఆదర్శమని, సమసమాజ నిర్మాణం సిపిఎంతోనే సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహించడానికి తగిన విధంగా పథక రచన చేసుకోవాలంటూ ఆమె పార్టీశ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.హెచ్.చంద్రశేఖర్, పందికాళ్లమణి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ రామచంద్ర పాల్గొన్నారు.



సుధీర్‌తో పాటు పలువురిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

గంజాయి ముఠా గుట్టురట్టు

- 34 కిలోలు స్వాధీనం
- 14 మంది నిందితులు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి



అరెస్టయిన నిందితులతో ఎస్‌పి ధీరజ్, పోలీసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్/కలకడ

ఒరిస్సా రాష్ట్రంతోపాటు ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాకు గంజాయి సరఫరా చేసే ఓ ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి మీడియాతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రాయచోటి, మదనపల్లి ప్రాంతాలల్లో గంజాయి సరఫరా చేస్తూ విక్రయిస్తున్న 14 మంది నిందితులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.12 లక్షల విలువ చేసే 34 కిలోల గంజాయిని, ఓ ఆటో, 3 బైకులు, 11 సెల్ ఫోన్‌లను కలకడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితులలో ఓ మహిళతోపాటు ఇద్దరు వృద్ధులు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి సరఫరా చేసే ముగ్గురు బడా స్మగ్లర్లను గుర్తించామని, ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నారని, వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలను వినియో గాన్ని సహించేది లేదని, గంజాయి సేవించే యువత మత్తుని వీడి చదువుపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గంజాయి విక్ర యాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి గురించి ఎవరైనా సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలి పారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రత్యేక కృషి చేసిన రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్.కృష్ణమోహన్, కలకడ సిఐ బి.లక్ష్మణ, ఎస్ఐ బి.రామాంజనేయులు, కుమారి హారిక, పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్



అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో, బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారని, ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు వివిధ రకాల అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధు సూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్,ఏడి సర్వే భరత్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆడబిడ్డలకు రక్షణ కల్పించండి

- తాలూకా పోలీసు స్టేషన్ వద్ద గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

సైకోగా మారి గ్రామంలో అల్లర్లు సృష్టిస్తూ ఆడపిల్లల వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్న వెంకటప్పను గ్రామం నుంచి బహిష్కరించాలని, రక్షణ కల్పించాలంటూ సోమవారం మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ ముందు పాశంవారిపల్లికి చెందిన గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 150 కుటుంబాలు ఉన్నాయని, చాలామంది ఆడపిల్లలు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని వెంకటరమణ, ముద్దక్క దంపతుల కుమారుడు వెంకటప్ప ఎంబిఎ పూర్తి చేసినా ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ ఆడపిల్లలను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఎవరైనా నిలదీస్తే వారి పైన దాడికి తెగబడుతూ పరుష పదజాలంతో దూషిస్తున్నాడ న్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న సునీత అనే మహిళ పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచాడని , మరో రెండు మూడు కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేశాడని పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులందరం ఏకమై వెంకటప్పను గ్రామం నుంచి వెలివేయాలంటూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. విచారించి గ్రామంలో ఇబ్బందులు సృష్టిస్తూ, పలువురిపై దాడులు తెగబడుతూ, ఆడపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వెంకటప్ప పై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఊరు నుంచి తరిమేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు ఎస్ఐ గాయత్రి ఫిర్యాదు తీసుకుని విచారిస్తామని తెలిపారన్నారు.

విద్యార్థులు మానసిక వికాసంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు విద్యార్థి దశ నుండే కెరియర్ గైడెన్స్‌తో పాటు తన మానసిక వికాసంపై దృష్టి సారించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్ర కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కస్తూరిబా పాఠశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులకు మానసిక వికాసం కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని ఎలా నియంత్రించుకోవాలి, కోపం, భయం వాటి నుండి ఎలా బయటపడాలి, ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అన్ని అంశాలపై విలువైన సూచనలు, సలహాలు ఇచ్చామని చెప్పారు. జిసిడిఒ సుమతి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కెరియర్ గైడెన్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ డాక్టర్ ఎస్.సుప్రియ, పాఠశాల ప్రిన్సిపల్ పుష్పలత, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్ర కుమార్

అజ్ఞాతంలోకి బంగారు నగల వ్యాపారి

- నగల తయారీ పేరుతో రూ.లక్షల్లో వసూలు
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసుస్టేషన్‌కు పరుగులు



ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కొన్నేళ్లుగా నగల వ్యాపారం నిర్వహిస్తూ ఆభరణాలు తయారు చేస్తూ కస్టమర్లకు నమ్మకాన్ని కలిగించిన ఓ నగల వ్యాపారి పెద్ద మొత్తంలో నగదు, నగలు వసూలు చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు పది రోజులుగా షాపు మూసేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో బాధితులు లబోదిబోమం టున్నారు. తమకు న్యాయం చేయాలంటూ సోమవారం పోలీస్ స్టేషన్‌కు పరు గులు పెట్టారు. ఈ మేరకు స్థానిక ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, స్థానిక సిపాయి వీధికి చెందిన కె.సురేష్ కుమార్ అనే వ్యక్తి శ్రీసాయి సురేష్ జ్యువెలర్స్ షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో బంగారు ఆభరణాలు విక్రయించటంతో పాటు ఆర్డర్ ప్రకారం ఆభరణాలు తయారు చేయించి ఇచ్చేవారు. ఇతనితోపాటు అన్న నాని, తండ్రి నారాయణ ఆచారి పనిచేసేవారు. కాగా ఇతనికి మదనపల్లె మండలం బొమ్మనచెరువుకు చెందిన మహేష్ రూ. 3.40 లక్షలు చెల్లించి ఆభరణాలు ఆర్డర్ ఇచ్చారు. అదేవిధంగా రెడ్డి ప్రసాద్ 150 గ్రాముల పాత బంగారు, రూ. 15 లక్షల నగదు ఇచ్చి ఆభరణాలు చేయించమని ఆర్డర్ ఇచ్చారు. పట్టణానికి చెందిన రవిచంద్ర అనే మరో వ్యక్తి రూ. 3 లక్షల నగదు, రవితేజ రూ.8 లక్షలు ఇచ్చారు. ఇలా పలువురి వద్ద నగలు ఆర్డర్ తీసుకున్న సురేష్ కుమార్ లక్షల్లో వసూలు చేసి కుటుంబ సభ్యులతో సహా పది రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లిపో యారు. షాపు తెరవకపోవడం, సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడంతో ఏమి చేయాలో పాలుపోని బాధితులు మోసపోయామేమోనని భావించి సోమవారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు పరుగులు పెట్టారు. జరిగిన మోసం, అన్యా యంపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు విచారణ చేస్తామని తెలిపారు. సురేష్ కుమార్ వీరి వద్దనే గాక పలువురి వద్ద నగలు, నగదు తీసుకుని ఉడాయించినట్లు సమాచారం. సుమారు రూ. 20 కోట్లకు పైగానే కోర్టులో ఐపి దాఖలు చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు బాధితులకు ఏ విధంగా న్యాయం చేస్తారు వేచి చూడాల్సి ఉంది.

సాంకేతిక పద్ధతులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-మదనపల్లె : నిర్మాణ రంగంలో తాజా సాంకేతిక పద్ధతులు, ప్రమా ణాలపై అధ్యాపకులు, విద్యార్థులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ (టెక్నికల్ ప్రోగ్రామ్స్) వడ్డె బ్రహ్మేష్ పేర్కొన్నారు. మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో అర్కి టెక్చరల్ మోడలింగ్ యూసింగ్ రెవిట్ అనే అంశంపై ఆరు రోజుల స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మేష్ మాట్లాడుతూ 'రెవిట్" సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయో గకరమని, ఇది నిర్మాణ నాణ్యత, సామర్థ్యం, మన్నికను పెంచే వినూత్న పద్ధతులను నేర్చుకునేందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. నిర్మాణ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టుల భద్రత, నాణ్యత, విజ యం కోసం ఉత్తమ ప్రమాణాలు అవసరమని చెప్పారు. ప్రాజెక్టులు సమయానికి, బడ్జెట్ లోపల పూర్తి కావడంలో నాణ్యత నియంత్రణ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్స రం విద్యార్థులకు ఈ సాఫ్ట్‌వేర్ భవిష్యత్ ఉద్యోగావకాశాల దిశగా సహా యకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ యువరాజ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.విజయ్ కుమార్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బి.తురైరాజ్, కె.అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహాయక చర్యలకు స్కౌట్స్ యూనిట్ లీడర్లు సిద్ధం

ప్రజాశక్తి- రాయచోటి : మొంథా తుపాన్ విపత్తును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రానికి స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లు సిద్ధంగా ఉన్నారని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌పి ధీరజ్ కునుబిల్లిని సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో స్కౌట్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాయచోటిలోని డైట్ కళాశాలలో 160 మంది ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్స్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్స్‌కు స్ఫూర్తిని నింపాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎఎస్ఒసి లక్ష్మీకర్, స్కౌట్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్ రెడ్డి, యువ ఆపదమిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, స్కౌట్ యూనిట్ లీడర్లు ఖాదర్‌బాషా, గోపీనాథ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శాంతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ఎంపిపిగా శ్యామల

ప్రజాశక్తి-తంబళ్లపల్లె: నూతన ఎంపిపిగా కోసువారిపల్లె శ్యామల కోటిరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులుగా గుండ్లపల్లె పంచాయతీ టి.ఎరికల్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బాపూజీ పట్నాయక్, శ్యామల, ఎరికల్‌రెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో ఎంపిపిగా ఆ పనిచేసిన అనసూయమ్మ పదవికి రాజీనామా చేయడం గతంలో మండల ప్రత్యేక అహ్వానితులుగా ఉన్న డి.చిన్నరెడ్డి మృతి చెందడంతో ఆ పదవులకు ఎంపిక అనివార్యమైంది. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు మండలంలోని ఎంపిటిసిల ఆమోదంతో శ్యామల కోటిరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిపిగా ఎందుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరి సహకారంతో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఎంపిపి శ్యామల



మాట్లాడుతున్న మదనపల్లె జిల్లా సాధన సమితి ప్రతినిధులు

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ కొలిక్కి రావడం హర్షనీయమని, మంగళవారం జరిగే మంత్రివర్గ ఉపసంఘం భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు మదనపల్లె కేంద్రంగా జిల్లా ప్రకటించి, మాట నిలబెట్టుకోవాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించేందుకు, మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రితో భేటీ అవుతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక భారతీయ అంబేద్కర్ సేన (బాస్) కార్యాలయంలో మదనపల్లె జిల్లా సాధన సమితి ప్రతినిధులు కన్వీనర్ పిటిఎం శివప్రసాద్, కో-కన్వీనర్లు షేక్ రెడ్డిసాహెబ్ (కాంగ్రెస్ పార్టీ), తోపు కృష్ణప్ప (సిపిఐ), బి.శ్రీచందు (బహుజన సేన), దుగ్గిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (సిపిఎం) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు సాధ్యా సాధ్యాలపై నివేదికలో వివరించనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం నుండి వెళ్ళడైన విషయం ఇక్కడి ప్రజల్ని తీవ్రమైన ఆందోళనకు గురిచేసిందని చెప్పారు. ఇలాంటి అపోహలకు, ఆందోళనకు ఫుల్ స్టాప్ పెట్టేలా మంగళవారం ఉపసంఘంతో జరిగే భేటీలో ముఖ్యమంత్రి మదనపల్లె జిల్లా ప్రకటన చేసి, స్పష్టత ఇవ్వాలని కోరారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతోపాటు యర్రవారిపాళ్యం, చిన్నగొట్టిగల్లు మండలాల యొక్క ప్రజల విజ్ఞప్తి మేరకు.. ఆ రెండు మండలాలు కూడా మదనపల్లె జిల్లాలోకి కలపాలని కోరారు. మదనపల్లె జిల్లా కోసం పెద్దమనుషుల సమావేశం పేరుతో మంగళవారం మదనపల్లెలో నిర్వహించ తలపెట్టిన 'బిగ్ డిబేట్‌ను తుపాన్ కారణంగా నవంబర్ 4వ తేదీకి వాయిదా వేశామని పేర్కొన్నారు. పెద్దమనుషుల సమావేశానికి మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతోపాటు యర్రవారిపాళ్యం, చిన్నగొట్టిగల్లు మండలాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, మదనపల్లె జిల్లా ఆకాంక్షను ముఖ్యమంత్రికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బాస్ నాయకులు తలారి కృష్ణ, వై.గంగాధర్, బురుజు జనార్దన్, బహుజన సేన నాయకుడు మనోహర్‌రెడ్డి, సిఐటియు నాయకులు కదిరిప్ప పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో సదస్సు

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 'పట్టణీకరణ, స్థిరమైన అభివృద్ధి-వ్యాపార నాయకులకు సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సి.రామచంద్రయ్య ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జరుగుతున్న వేగవంతమైన పట్టణీకరణ పర్యావరణానికి, సామాజిక సమతుల్యానికి సవాళ్లు విసురుతోందని పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో సస్టైనబుల్ అర్బన్ ప్లానింగ్ అనేది అత్యవసరమని, భవిష్యత్ వ్యాపార నాయకులు తమ నిర్ణయాలలో పర్యావరణం, సామాజిక బాధ్యత, ఆర్థిక సమతుల్యం అనే మూడు ప్రధాన సూత్రాలను అనుసరించాలని ఆయన సూచించారు. పట్టణీకరణ కేవలం సమస్య కాదని, అది అవకాశాల వేదిక కూడా అని తెలిపారు. శుభ్రమైన ఇంధనం, గ్రీన్ నిర్మాణం, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్, వ్యర్థ నిర్వహణ వంటి రంగాల్లో స్టార్టప్‌లు, వ్యాపార అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. అనంతరం పట్టణ అభివృద్ధిలో వ్యాపార సంస్థల పాత్ర, ప్రభుత్వ విధానాలు, గ్రీన్ ఇన్నోవేషన్‌పై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమర్థవంతమైన సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమాన్ని ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ టి.నవనీత సమన్వయంతో నిర్వహించారు.



బాధితుడికి చెక్ పంపిణీ చేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - రాయచోటి

ఆపద సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 50 మంది లబ్ధి దారులకు సుమారు రూ .50 లక్షలు విలువ చేసే చెక్కులను టిడిపి నేతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయచోటి నియోజకవర్గంలో సుమారు 800 మంది లబ్ధిదారులకు కోట్లాది రూపాయలు సిఎం సహాయనిధి చెక్కులను అందజేశామన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రిలో చికిత్స పొందిన వారందరికీ కూడా సిఎం సహాయనిధి వారి కుటుంబాలకు కొండంత భరోసానిస్తుందన్నారు. వేలాదిమంది పేద మధ్యతరగతి ప్రజలకు సిఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు వివరించారు. రెండు రోజులు పాటు కురిసే తుపాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- రామపురం

గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి సోమవారం తన కార్యాలయంలో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుపాన్ కారణంగా మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులు ఎక్కువగా నష్టపోకుండా రైతు సేవా కేంద్రం సిబ్బంది మూడు రోజులపాటు గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. నష్టం వాటిలితే అంచనా వేసి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లకుండా సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. వరి పంట సాగు చేసిన పొలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉండకుండా కాలువ ద్వారా బయటికి పోయే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వెన్నులో ఉన్న పంటను కాపాడుకునేందుకు గుంపులుగా నిలబెట్టి కట్టడం 50 గ్రాముల ఉప్పును ఒక లీడర్ నీటితో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించాలని ఆదేశాలు ఇచ్చారు. గ్రామాలలో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లినా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 9441636606 సమాచారం అందజేయాలన్నారు. రైతులకు వాట్సాప్ గ్రూపుల ద్వారా వర్షాలు తగ్గేవరకు వరి కోత పనులను వాయిదా వేసుకోవాలని తెలియజేయలన్నారు. పంట నష్టం తగ్గించడానికి ఎప్పటికప్పుడూ పైస్థాయి అధికారుల నుంచి వచ్చే సూచనలు రైతులకు చెప్పాలని పేర్కొన్నారు.

యాత్రికులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కార్తీకమాసం సందర్భంగా సోమవారం తంబళ్లపల్లె మల్లయ్య కొండ యాత్రికుల శివనామస్మరణలతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఉదయమే స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండపై కేదారేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించి నోములు నోచుకున్నారు. మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి కొండపై భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు అమ్మ వారికి పూజారి శేఖర్ ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉదయ్ మోహన్‌రెడ్డి

వెలుగు కుటుంబానికి నా జీవితం అంకితం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: వెలుగు కుటుంబానికి తన జీవితాన్ని అంకితం చేస్తున్నానని వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వెలుగు పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సమక్షంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టిన ఉదయ మోహన్‌రెడ్డికి వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, విద్యార్థులు సిబ్బంది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు దుస్తులు బెడ్ షీట్లు, వృద్ధులకు మొఫ్లర్లు, ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సమక్షంలో తన పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. వీరితోనే తన జీవితం ముడిపడి ఉందని, వెలుగు కుటుంబంతోనే తన ప్రాణం ఉందని, వెలుగు కుటుంబ సభ్యులతోనే జీవితాంతం వరకు గడుపుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ట్రెజరర్ రఘునాథరెడ్డి, ప్రిన్సిపల్ మీనా కుమారి, వార్డెన్ స్వీటీ, సోషియల్ వర్కర్ గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నిలిచిన నీరు

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డి పల్లి మేజర్ గ్రామ పంచాయతీ భారత్ గ్యాస్ సమీపంలోని గణపతి నగర్, విద్యానగర్ లో ఈ మధ్య కురిసిన వర్షాలకు ఇండ్ల మధ్య నీరు నిలిచిపోవడంతో ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బం దులు లేకుండా నీటిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశిం చారు. పంచాయతీ సిబ్బంది రెండు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగించేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, ఇఒపిఆర్‌డి సునీల్ కుమార్, ఎంపిటిసి కసిరెడ్డి రమేష్ రెడ్డి, వైసిపి నాయకులు గుణ యాదవ్, సోమిశెట్టి ప్రభాకర్, కాకి చంద్ర పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

- కమిషనర్ తీరుపై వైసిపి కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-రాజంపేట

సోమవారం పురపాలక కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభసగా మారింది. మున్సిపల్ కమిషనర్ తీరుపై వైసిపి కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ మర్రి రవి కమిషనర్, మున్సిపల్ సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు చేశారు. పురపాలక సిబ్బంది పలుచోట్ల అవినీతికి పాల్పడుతున్నారని, సీనియర్లను కాదని జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వ్యక్తికి ఆర్ఐగా ఉద్యోగోన్నతి ఎలా పొందుతారని ప్రశ్నించారు. కమిషనర్ కేవలం తన స్వలాభం కోసమే ఇలా చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధమని ప్రతి దుకాణాల వద్దకు వెళ్లి కవర్లను సేకరించారని, అనంతరం పురపాలక కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి తిరుపతి నుండి ఓ కవర్ల తయారీదారుడిని పిలిపించి అతని దగ్గర మాత్రమే కవర్లు కొనుగోలు చేయాలని దుకాణాదారులకు మున్సిపల్ అధికారులు సూచించారని, తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి అంటూ సమావేశంలో వైస్ చైర్మన్ రవి చరవాణిలోఆడియో రికార్డింగ్ వినిపించారు. తీరు మార్చుకోకపోతే రాజీనామా చేస్తానని సమావేశంలోనే నేలపై బైఠాయించారు. కౌన్సిలర్ పోలా రమణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం



కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ మర్రి రవి

అస్తవ్యస్తంగా ఉందని, ప్రతి కౌన్సిలర్ కు ముగ్గురు చొప్పున పారిశుధ్య కార్మికులను అప్పగిస్తే తానే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచు తామని కమిషనర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నాలుగు సంవత్సరాల అభివృద్ధి, నిధులు వినియోగంపై శ్వేత పత్రం విడుదల చేయాలని టిడిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బహుదా జలాశయం నుంచి నీరు విడుదల



బహుదా ప్రాజెక్టు వద్ద జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండగా, సోమవారం తెల్లవారుజామున ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు నుంచి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా బహుదా ప్రాజెక్టును పరిశీలించి స్థానిక కూటమి నాయకులతో, అధికారులతో కలసి జల హారతి ఇచ్చారు. అనంతరం ప్రాజెక్టు వద్ద సుమారు రూ.30 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన జనరేటర్‌ను, బహుదా ప్రాజెక్టు కార్యాలయంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పరిపాలన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, అదే లక్ష్యంగా మంత్రులను, ఎమ్మెల్యేలను పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో గాడితప్పిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అన్ని విధాల సరిదిద్దుతున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు పడుతూ, జలాశయాలని నిండుకుండను తలపిస్తుంటే రైతుల కళ్ళల్లో ఆనందం ఉప్పొంగుతున్నాదని పేర్కొన్నారు. రైతులు సాగు చేసే ప్రతి పంటకు గిట్టు బాటు ధరలు అందుతున్నాయని తెలిపారు. బహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో ప్రాజెక్టు కింద సుమారు 3 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంటలను సాగు చేయడానికి అవకాశం కలిగిందని వివరించారు. త్వరలోనే బహుదా ప్రాజెక్టులో మత్స్య శాఖ ద్వారా చేపలను పెంచి మత్స్య సంపదను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గతంలో బహుదా ప్రాజెక్టు గేట్లు ఎత్తడానికి జనరేటర్ లేక ఇబ్బందులు పడుతుండగా, సుమారు 30 లక్షలు నిధులను వెచ్చించి నూతన జనరేటర్ ను ఏర్పాటు చేసి, ప్రాజెక్టు వద్ద కార్యాలయ భవనాన్ని నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అర్హులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, టిడిపి మండలాధ్యక్షులు పుర్రా వెంకటరమణ, బహుదా నీటిపారుదల సంఘం అధ్యక్షులు దేవేంద్రరెడ్డి, రాజన్న, రెడ్డప్పరెడ్డి, మాజీ సర్పంచ్ రమణ, లక్ష్మన్న, చంద్రాయుడు, శ్రీపతి, సుధాకర, జనసేన పార్టీ మండలాధ్యక్షులు ప్రదీప్ సింగ్, అఫ్రోజ్ ఖాన్, తహసిల్దార్ తపస్విని, ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఇరిగేషన్ ఇ సురేష్ బాబు, డిఇఇ రమణ ప్రసాద్, ఎఇ శ్రీహరిరెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

చెరువులపై నిఘా పెంచండి : కలెక్టర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మొంథా తుపాన్ నేపథ్యంలో హెచ్ఎన్ఎస్ఎస్-పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా నిండే చెరువులపై నిఘా పెంచి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని గుమ్మసముద్రం, పెద్దచెరువును పరిశీలించారు. తుపాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని వివిధ చెరువులు నిండి ఓవర్‌ఫ్లో అయ్యే పరిస్థితులు ఉన్న సందర్భంగా చెరువులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో వివిధ విషయాలు చర్చించారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా ఎన్ని చెరువులు నిండుతాయి, వాటిల్లో ఎన్ని పూర్తిగా నిండాయి. తదితర విషయాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్షం ప్రభావం వల్ల పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా నిండే చెరువులలో నెలకొన్న పరిస్థితిని పరిశీలించారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వల్ల నిండే చెరువులు ఓవర్ ఫ్లో అయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు పోలీస్, రెవెన్యూ అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రమాదకరంగా ఉండే వాగుల మీదుగా ప్రజలు ప్రయాణాలు సాగించకుండా హెచ్చరికలు జారీ చేయాలని పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు ముఖ్యమైన వాగుల దగ్గర సిబ్బందిని ఏర్పాటు చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ముఖ్యమైన చెరువులపై నిఘా పెంచి అన్ని చర్యలకు సంసిద్ధంగా ఉండాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ విఠల్ ప్రసాద్, ఇఇ అమరనాథ్‌రెడ్డి, డిఇ వెంకట ప్రతాప్, తహశీల్దార్ బాబ్ జాన్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్ భావన

రాజంపేట: మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుపాన్ ప్రభావం నాలుగు రోజులు పాటు ఉంటుందని తెలిపారు. వర్షాలు పడుతున్న సమయంలో పిల్లలు, మహిళలు అందరూ జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అత్యవసరమైతేనే ఇంట్లో నుండి బయటకు రావాలని, లేదంటే ఇంట్లోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చెరువులు, నదులు, వాగులు, వంకలు పొర్లి ప్రవహించేటప్పుడు రోడ్లు దాటేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. **రాయచోటి:** భారీ వర్షాలు నేపథ్యంలో నియోజకవర్గ రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ రూరల్ కాటిమాయకుంట పంచాయతీ, గుంటిమడుగు గ్రామంలో భారీ వర్షాల వల్ల గ్రామంలోని పెద్ద చెరువు, గోలాన్ చెరువుకు భారీ గండి పడటంతో వర్షంలోనూ చెరువు దగ్గరకు వచ్చి సహాయక చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గాజుల ఖాదరబాష, నాగార్జునరెడ్డి, అజాసలిఖాన్, సురేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గుట్టపల్లి కిషోర్, రఘునాథ, రవిశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు. **కలకడ:** తుపాన్‌పై మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసినట్లు ఎంపిడిఒ భాను ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ ప్రజలకు హెచ్చరిక, అలర్ట్ మెసేజ్ పంపామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ శైలజ, ఎంఇఒ మునీంద్రనాయక్, పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఎఇ ప్రణయ్ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** బహుదా ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురంకు వెళ్లే దారులను అధికారులు మూసివేశారు. బహుదనదిపై ఉన్న వంతెనల వద్ద నీటి ప్రవాహాన్ని తహశీల్దార్ తపస్విని, ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎస్ఐ తిప్పేస్వామి పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డిటి సిరాజుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, పాల్గొన్నారు. **కలికిరి:** బహుద నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ హరికుమార్ సూచించారు. బాహుదా నదిలో నీరు ప్రవహిస్తున్నడంతో మండలంలోని మేడుకుర్తి, చీకటిపల్లి, మహల్ నదీ పరివాహక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహల్ దగ్గర ప్రవహిస్తున్న బహుద నదిని పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తపేట విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట



నాగిరెడ్డి హారిక



ఓంకార్

కడప పట్టణంలోని మాంటిస్సోరి జగతి పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి చదువుతున్న ఓంకార్ అండర్-17 విభాగంలోనూ, 8వ తరగతి చదువుతున్న నాగిరెడ్డి హారిక అండర్-14 బాలికల విభాగంలోనూ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నట్లు పీడీ బాలశేఖర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వీరు ఈ నెల 31వ తేదీ నుండి రాజమండ్రి దగ్గర కోవూరు గ్రామంలో జరిగే పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీఅక్బర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల బృందం అభినందించారు.

వాలీబాల్ పోటీలకు 'పాటూరు' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-నందలూరు



నక్షత్ర



ప్రియ



శివమంజుల

కడప పట్టణంలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషనల్ స్కూల్ లో ఆదివారం జరిగిన అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు చెందిన ఎం.యేసుప్రియ, బి.నక్షత్ర అండర్-14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిరు వురు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అండర్-17 విభాగంలో కె.శివ మంజుల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారిణి పాల్గొనబోతోంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జి.మాధవి లత మాట్లాడుతూ, అండర్-14, అండర్-17 విభాగాలలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినీలు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని వారిని అభినందించారు. కార్యక్ర మంలో పాఠశాల పీడీ ఎం.సుస్మిత, పిఇటి పి.జగన్, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ లో ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు 'గురుకుల' విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు: మండలంలోని మహాత్మ జ్యోతిభా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సెకండ్ ఇయర్ ఎంపిసి చదువుతున్న విద్యార్థిని ఎస్.నిత్య ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో తన ప్రతిభ చూపి డిస్క్‌త్రో, షాట్‌పుట్ విభాగంలో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఫస్ట్ ఇయర్ సిఇసి చదువుతున్న కె.మానస రాష్ట్ర స్థాయి పోటీలలో కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులకు నీట్, జెఇఇ ప్రవేశాలకు ఈ పతకాలు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల, కళాశాల చదువులకే కాకుండా క్రీడలకు కూడా పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థులకు మంచి శిక్షణ అందించి కళాశాల పేరును రాష్ట్ర, జాతీయ స్థాయిలకు చేరుస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.జి. సునీత ను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి: మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో రెండు రోజులు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి సూచించారు. సోమవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజంపేట, పెనగలూరు మండలాల్లో వరి పంట దెబ్బతిని రైతులు నష్టపోయారని, ప్రభుత్వం స్పందించి నష్ట పోయిన వారికి పంట నష్టం వచ్చేలా చూడాలని కోరారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలపై తుపాన్ తీవ్రప్రభావం చూపుతున్నాయన్నారు. ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్ట పోతూనే ఉన్నారని తెలిపారు. తుపాన్ ప్రభావంతో పశువులతో పాటు, పొలంగట్లు, విద్యుత్ వైర్లు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



కుంగిన కలికిరి పెద్ద చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

కుంగిన తూము..పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి పెద్ద చెరువుకట్ట తూము కుంగడంతో ఎంపిడిఒ భాను మూర్తిరావు ఆధ్వర్యంలో అధికారులు వెళ్లి పరిశీలించారు. స్థానికులు కొంత మంది పెద్దచెరువు తూమును మట్టి తోలి పూడ్చివేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తూము వద్ద పూడిక ఏర్పడి కట్టమీద మట్టి కుంగిపోవడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఎంపిడిఒ భానుమూతిరావు, ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది అక్కడికి చేరుకుని కట్టను పరిశీలించారు. ఇప్పటికిప్పుడు చెరువు కట్టకు ప్రమాదం లేదని అయితే ముందస్తు చర్యల్లో భాగంగా పూడిపోయిన తూములోని మట్టిని వెలికి తీసి, కొత్త తూమును ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం వారి ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రియాజ్ అహ్మద్, టిడిపి నాయకుడు యోగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించారు..న్యాయం చేయండి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి, డబ్బు, రాజకీయ పలుకుబడితో అధికారాన్ని అడ్డం పెట్టుకొని తమను స్థలంలోకి రానీయకుండా వేధింపులకు గురి చేస్తున్నారంటూ బాధితులు వాపోయారు. న్యాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సోమవారం బాధితులు మదనపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలం, తవలం గ్రామానికి చెందిన మేష సుధాకర్, మేష మల్లేశ్వరి, మేష చంద్రాయప్ప అయిన తమకు గ్రామంలో 465/6 సర్వేనెంబర్‌లో 9 సెంట్ల ఇంటి స్థలం ఉందన్నారు. ఈ స్థలం ఇప్పటికీ తమ పూర్వీకులైన మేష శ్రీరాములు పేరుపైనే ఉందని, రెవెన్యూ రికార్డులలో, 1-బిలో శ్రీరాముల పేరు మీద పక్కాగా ఉన్నాయన్నారు. అయితే స్థానికంగా ఉంటున్న కడపల రెడ్డప్ప తమ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి, సంబంధం లేని మేష పాపన్న అనే వ్యక్తి ఈ స్థలం విక్రయంచారని డాక్యుమెంట్లలో చూపిస్తూ తమను అడ్డుకుంటున్నాడని వాపోయారు. తమ రికార్డులను తీసుకెళ్లి తహశీల్దార్ తపస్విని, ఆర్ఐ, విఆర్ఒలకు చూపించామని అయితే అధికారులు కూడా తాత్సారం చేస్తూ తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాము సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించినప్పటికీ కడపల రెడ్డప్ప డబ్బు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను ప్రలోభాల గురిచేసి తమకు న్యాయం చేయకుండా అడ్డుకుంటున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమ రికార్డులను పరిశీలించి, పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిన స్థలాన్ని తమకు అప్పగించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ప్రజలకు అండగా ఉండండి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

తుపాన్ ముగిసే వరకూ మండల అధ్యక్షులు, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, అధికారులతో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో ప్రజలకు నాయకులు అందు బాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. చెరువులు నిండుకుండలా ఉండటంతో అవి పొంగి పొర్లి ప్రవహించేటప్పుడు వాగులు, వంకలు, రోడ్లు దాటవద్దని సూచించారు. తీరం దాటే సమయంలో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు ప్రజలు ఇండ్లలో నుంచి బయటికి రావద్దని తెలిపారు.ప్రజా భద్రతే లక్ష్యంగా సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు

వేరుశనగ పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

రైతులు తగ జాగ్రత్తలు తీసుకుంటే వర్షాల నుండి పంటలను కాపాడుకోవచ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల రైతులకు సూచించారు. జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను కెవికె శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. వివిధ మండలాల్లోని గ్రామాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి, కెవికె శాస్త్రవేత్తలు వివిధ పంటలు పరిశీలించి అధిక వర్షాలకు పంటల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ కె.మంజుల, కెవికె సమన్వయకర్త పర్యవేక్షణలో కలికిరి మండలంలోని మేడుకుర్తి, అచ్చిపిరెడ్డివారిపల్లి, వాల్మీకిపురం మండలంలోనిగండబోయినపల్లి, దాసరవారిపల్లి, విఠలం గ్రామాల్లోని వరి, వేరుశనగ, టమోటా, ఇతర పంటలను పరిశీలన చేసి రైతులకు తగు సూచనలు చేసి పంటలలో నిలిచి ఉన్న నీటిని తీసివేయాలని సూచించారు. వర్షాలు ఆగిన తర్వాత పిచికారి సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.విశ్వనాథ్, తెగుళ్ళ, విభాగం ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ సంధ్యారాణి, సేద్య విభాగం శాస్త్రవేత్త, డాక్టర్ సహజ దేవా, సేద్య విభాగం శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి, కెవికె శాస్త్రవేత్తలు, ఎస్.సోమశేఖర్ బాబు, డాక్టర్ కె.మాధురి, డాక్టర్ ఎ.శ్రీనివాసులు, డాక్టర్ వై.పీరూసాహెబ్, వాల్మీకిపురం ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె కేంద్రంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. ఈ మేరకు స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ రాజారెడ్డి, ఎస్ఐ రహమతుల్లాతో కలిసి నిందితులను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మదనపల్లె మండలం, వలసపల్లె మొలకలదిన్నెకి చెందిన గుర్రాల వాసు అలియాస్ ఎరుకుల శ్రీనివాసులు, కురబలకోట మండలం, తెట్టు ఆరోగ్యపురానికి చెందిన రత్నవేలు కుమారుడు గెంటిమ్ ఆనంద్ కుమార్ మదనపల్లె పరిసర ప్రాంతంలో ఉన్న జాఫర్ అలీ, శివకుమార్‌ల దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసి మదనపల్లె, అంగళ్లు తదితర ప్రాంతాల్లో రహస్యంగా యువతకు, విద్యార్థులకు విక్రయించే వారన్నారు. ఈ క్రమంలో తట్టివారిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనివాసులు, ఆనంద్ కుమార్ ఇద్దరూ పట్టుబడ్డారన్నారు. వీరివద్ద రూ. 20వేల విలువ చేసే రెండు కిలోల గంజాయి పట్టుబడగా ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. గతంలో శ్రీనివాసులుపై మూడు గంజాయి కేసులు ఉన్నాయన్నారు. గంజాయి సేవించిన పలువురిని గుర్తించి మొదటి తప్పుగా భావించి కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. గంజాయి సరఫరాలో ఇంకా ప్రమేయం ఉన్న వారిని గుర్తించి అరెస్టు చేస్తామన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు